# ఆర్అండ్ బీ రోడ్లకు మహర్దశ

- రూ.7 కోట్లతో పెద్దపల్లి-ధర్మారం రోడ్డు ఫోర్‌లేన్‌గా విస్తరణ
- ముమ్మరంగా డివైడర్, డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్ పనులు
- కోదాడ-రాయపట్నం రాష్ట్ర రహదారి ఫోర్‌లేన్ రోడ్డు విస్తరణకు మోక్షం
- ఎస్‌డీఎఫ్ నిధులు రూ.14.50 కోట్లు మంజూరు



ధర్మారం గాంధీ విగ్రహం నుంచి విస్తరిస్తున్న ఆర్అండ్‌బీ రోడ్డు

ధర్మారం,అక్టోబర్ 10: సర్కారు కృషితో ధర్మారం మండలంలోని రహదారులకు మహర్దశ పడుతున్నది. పెద్దపల్లి ఆర్అండ్‌బీ రోడ్డు, కోదాడ–రాయపట్నం రహదారి ఫోర్‌లేన్‌గా విస్తరణకు మోక్షం లభించింది. ధర్మారం అంబేద్కర్ చౌరస్తా నుంచి ఎస్సారెస్పీ డీ–83 కాలువ వరకు పెద్దపల్లి వెళ్లే ఫోర్‌లేన్ విస్తరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. తాజాగా జక్కన్నపల్లి నుంచి బీసీ కా లనీ వరకు కోదాడ – రాయపట్నం రాష్ట్ర రహదారి నాలుగు వరుసల విస్తరణకు ప్రభుత్వం ఎస్‌డీఎఫ్ ద్వారా రూ.14.50 కోట్లు మంజూరు చేసింది.



ఏఎంసీ ముందు నుంచి వడ్డెర కాలనీ వరకు నిర్మించిన డివైడర్

ఇటీవలే మంత్రి శంకుస్థాపన చేశారు.

రెండు వరుసలు గల ధర్మారంలోని పెద్దపల్లి ఆర్ అండ్‌బీ రహదారిని ఫోర్‌లేన్‌గా విస్తరణకు ప్రభుత్వం రూ. 7 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే అంబేద్కర్ చౌరస్తా నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఫోర్‌లేన్‌తో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయింది. గాంధీ విగ్రహం నుంచి ఏఎంసీ ప్రధాన గేట్ వరకు రోడ్డు విస్తరణకు రూ. కోటి కేటాయించగా పనులు వేగంగా సాగుతున్నాయి. ఏఎంసీ ఆఫీసు గేట్ నుంచి ఎస్సారెస్పీ డీ–83 కాల్వ వరకు రూ.2 కోట్లతో డివైడర్, సెంట్రల్ లైటింగ్ నిర్మించనున్నారు. రోడ్డు విస్తరణ చేపట్టగా బీటీ రోడ్డు నిర్మించాల్సి ఉన్నది. రూ. 3.50 కోట్లతో చేపట్టిన అంబేద్కర్ చౌరస్తా నుంచి ఎస్సారెస్పీ కాల్వ వరకు ఇరువైపుల డ్రైనేజీ, బీటీ రోడ్డు, డివైడర్ పనులు వేగంగా సాగుతున్నాయి. అంబేద్కర్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు డివైడర్, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ధర్మారంలోని కోదాడ–రాయపట్నం మీదుగా వెళ్లే రాష్ట్ర రహదారిని ఫోర్‌లేన్‌గా విస్తరణకు సర్కారు రూ. 14.50 కో ట్లు మంజూరు చేసింది. ఈ నెల 4న మంత్రి కొప్పుల ఈశ్వర్ శంకుస్థాపన చేశారు. మండలకేంద్రం శివారులోని జక్కన్నపల్లి 18 కిలో మీటర్ నుంచి బీసీ కాలనీ శివారులోని 20.4 కిలోమీటర్ వరకు రోడ్డును వెడల్పు చేయనున్నారు. అనంతరం డివైడర్లు నిర్మించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తారు. ఈ రోడ్డు విస్తరణ పూర్తయితే మండలకేంద్రం కళకళలాడనుండగా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



విస్తరించనున్న కోదాడ- రాయపట్నం రహదారి



మాట్లాడుతున్న పెద్దపల్లి కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

# నియమావళి పాటించాలి

- ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు
- ఫిర్యాదుల కోసం 24 గంటలూ 1950 టోల్ ఫ్రీ నంబర్
- ఓటు నమోదుకు ఈ నెల 30 వరకు అవకాశం
- జిల్లా ఎన్నికల అధికారి ముజామ్మిల్ ఖాన్

పెద్దపల్లి, అక్టోబర్ 10 : ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సూచించారు. కేంద్రం ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తామని చేశారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లో డీసీపీ వైభవ్ గైక్వాడ్, అదనపు కలెక్టర్ జీవీ శ్యాం ప్రసాద్ లాల్‌తో కలిసి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ, కోడ్ అమలుపై కలెక్టర్ ప్రెస్ మీట్ నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని, నవంబర్ 3న నోటిఫికేషన్ వస్తుందని, నవంబర్ 3 నుంచి నవంబర్ 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, నవంబర్ 13 వరకు నామినేషన్ల స్క్రూటినీ, నవంబర్ 15 వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందని, నవంబర్ 30న పోలింగ్, డిసెంబర్ 3న కౌంటింగ్ నిర్వహణ జరుగుతుందని వెల్లడించారు.

## జిల్లాలో 6,94,612 మంది ఓటర్లు

ఈ నెల 4న ఇచ్చిన ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 6,94,612 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు సరి చూసుకోవాలని, పేర్లు లేనివారు ఈనెల 30 వరకు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా 837 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, అవసరమైన మేరకు బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నుంచే కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు.

## అమలులో ఆంక్షలు..

కులం, మతం, ప్రాంతంపై విద్వేషాలు పెంచేలా వ్యాఖ్యలు చేయడం నిషేధమని, ఓటర్లను ప్రలోభ పెట్టొద్దని, బెదిరింపులకు పాల్పొడద్దని, తప్పుడు ప్రచారం చేయద్దొని, ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోడ్ వచ్చినప్పటి నుంచే ఆంక్షలు అమలులో ఉంటాయని, ప్రతి ఒక్కరూ గమనించాలని సూచించారు. రాజకీయ పార్టీల సమావేశాలకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు ఇస్తామని, ముందు దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి వీలు లేదని చెప్పారు. ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాలు, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో రాజకీయ సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు.

## ఉల్లంఘిస్తే చర్యలు

ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో 10 సర్వైవ్‌లెన్స్, 10 ఫ్లయింగ్ స్క్వాడ్, 5 వీడియో సర్వైవ్‌లెన్స్ బృందాలు, ఎంసీఎంసీ, ఇతర కమిటీలను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. కోడ్ ఉల్లంఘనపై ప్రజలు 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా, సీ–విజల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. సమీకృత కలెక్టరేట్‌లో ఫిర్యాదుల స్వీకరణకు 24 గంటల కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, సీ–విజల్ యాప్‌లో లైవ్ వీడియో అప్‌లోడ్ చేసిన 100 నిమిషాల గడువులోపు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి చర్యలు తీసుకుంటారని తెలిపారు. కోడ్‌ను ఉల్లంఘిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని, సజావుగా ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

## గట్టి నిఘా : డీసీపీ వైభవ్ గైక్వాడ్

జిల్లాలో అక్రమ నగదు, లిక్కర్ సరఫరా జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని డీసీపీ వైభవ్ గైక్వాడ్ స్పష్టం చేశారు. జిల్లాలో నాలుగు చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, 24 గంటలపాటు నిఘా ఉంచామని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీ సెక్షన్ పర్యవేక్షకుడు ప్రకాశ్, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ పాల్గొన్నారు.

## దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి నుంచే ఓటేసే అవకాశం

మంథని, అక్టోబర్ 10: మంథని నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మంథని ఆర్డీవో హనుమ నాయక్ తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో మొత్తం 288 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఇందులో మోడల్–5, పీడబ్ల్యూ(దివ్యాంగులు) పోలింగ్ కేంద్రాలు–1, మహిళా పోలింగ్ కేంద్రా0లు–5, యువకుల పోలింగ్–1గా ఎంపిక చేశామన్నారు. వృద్ధులు, దివ్యాంగులు 12డీ ఫారం ద్వారా దరఖాస్తు చేసుకుంటే ఇంటి వద్ద నుంచే ఓటు వేసే వెసులుబాటు కల్పిస్తాన్నామన్నారు. నియోజకవర్గంలో 9 మండలాల ఎంపీడీవోలను, మంథని మున్సిపల్ కమిషనర్‌ను మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారులుగా నియమించామని చెప్పారు. రాజకీయ సమావేశాల కోసం సువిధ, ఫిర్యాదుల కోసం సీవిజిల్ యాప్‌లను వినియోగించుకోవాలని సూచించారు. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లోనే పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో ఆఫీసు ఏవో రవీందర్, తహసీల్దార్ రాజయ్య, డీటీ సంతోష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

# రైతులు సంఘటిత శక్తిగా ఎదగాలి

- కిసాన్ గ్రామీణ మేళా కన్వీనర్ పీ సుగుణాకర్ రావు
- రెండో కొనసాగిన మేళా



మాట్లాడుతున్న సుగుణాకర్‌రావు

విద్యానగర్, అక్టోబర్ 10: రైతులంతా సంఘటిత శక్తిగా ఎదగాలని కిసాన్ గ్రామీణ మేళా కన్వీనర్ పీ సుగుణాకర్ రావు పిలుపునిచ్చారు. నగరంలో మంగళవారం కొనసాగిన కిసాన్ గ్రామీణ మేళా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు, సహకార సంఘాలు ఎఫ్‌పీవోలుగా సంఘటితమైనప్పుడే ఆర్థికంగా ఎదుగుతారని తెలిపారు. తమ పంటలను మార్పిడి చేసి, విలువలను జోడించి వ్యాపారులుగా ఎదగాలని అది సహకార సంఘాలు, ఎఫ్‌పీవోల ద్వారానే సాధ్యమని చెప్పారు. రైతులు పంట ఉత్పత్తులతో పాటు పశుపోషణ, కూరగాయలు, పండ్ల తోటలను పెంచడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. కిసాన్ జాగరణ్ కిసాన్ గ్రామీణ మేళా ద్వారా పంటల సాగులో కొత్త పద్ధతులు, యంత్రాలు, పనిముట్ల గురించి రైతులకు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. నాబార్డ్ అధికారి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, నాబార్డ్ ద్వారా రైతుల ఆర్థికాభివృద్ధికి రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఖాదీ గ్రామీణ పరిశ్రమల శాఖ రాష్ట్ర డైరెక్టర్ నారాయణరావు మాట్లాడుతూ, కులవృత్తుల వారికి ఆర్థికంగా చేయూతనిస్తామని తెలిపారు. అనంతరం గ్రామీణ భారతి అధ్యక్షుడు రాజా రెడ్డి మాట్లాడుతూ, గ్రామ అభ్యున్నతి కోసం ప్రభుత్వాలతో పాటు సామాజిక సంస్థలు కృషి చేయాలని సూచించారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శశిధర్ మాట్లాడుతూ, పత్తిలో పురుగుల నివారణ చర్యల గురించి వివరించారు. ప్రభుత్వ పశు వైద్య కళాశాల డీన్ మాధవరావు మాట్లాడుతూ, పశుపోషణ గురించి వివరించారు. పశువుల ఆరోగ్య సమస్యలపై డాక్టర్ అనిత వివరించారు. వెటర్నరీ విద్య ద్వారా ఉపాధి అవకాశాల గురించి డాక్టర్ సంతోషిని వివరించారు. కేవీకే శాస్త్రవేత్త వెంకటేశ్వరరావు వరి, పత్తి పంటల సాగు గురించి వివరించారు. ఉత్తమ రైతులు వెంకట్ రెడ్డి, మాధవ రెడ్డి వారి అనుభవాలను, మంజీర సంస్థ ప్రతినిధి ఉదయ భాస్కర్ చేపల పెంపకంతో లాభాలను వివరించారు. నాయకులు మల్లేశం యాదవ్, సునీల్ రావు, దుర్గా మారుతి, ఆనంద్, మొలుగూరి కిశోర్, లక్ష్మణ్, మునీర్ ఖాన్, నరసింహా రెడ్డి, జితేందర్ రెడ్డి, బలరాం సింగ్, అంజి, ఎఫ్‌పీవో అధ్యక్షులు కమలాకర్ రావు, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు స్పందన

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 10: జిల్లా కేంద్రంలోని మంకమ్మతోట శివాని డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. ఈ డ్రైవ్‌లో 15 సంస్థలు పాల్గొనగా, 600 మంది విద్యార్థులు తమ పేరు నమోదు చేసుకున్నారు. ఇందులో భాగంగా 186 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్లు ఎర్రంశెట్టి మునీందర్, సిరిపురం ప్రసాద్ పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు వెంటనే ఆయా కంపెనీల్లో జాయిన్ కావాలని క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కోఆర్డినేటర్ తాళ్లపల్లి అశోక్ సూచించారు. ఈ సందర్భంగా శాతవాహన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు వంగపల్లి ఉమాదేవి–సతీశ్‌కుమార్ మాట్లాడుతూ, కళాశాలలో ప్రతి సంవత్సరం క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## మనోవికాస్ సందర్శన

కలెక్టరేట్, అక్టోబర్ 10: నగరంలోని మానసిక దివ్యాంగుల పాఠశాల (మనోవికాస్)ను సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటేశ్ మంగళవారం సందర్శించారు. అలాగే, వృత్తి విద్యా కేంద్రం తనిఖీ చేసి, ఆయాచోట్ల పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# 13న జిల్లా స్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు

కొత్తపల్లి, అక్టోబర్ 10: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఈనెల 13న జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ కం సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. అండర్–14, 17లో బాలబాలికలకు ఈ ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రతిభ చూపిన వారిని ఈనెల 19 నుంచి 21 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని 16 మండలాల కన్వీనర్లు వాలీబాల్ జట్టు వివరాలను ఒకరోజు ముందుగానే ఎస్జీఎఫ్ కార్యదర్శికి అందజేయాలన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ప్రధానోపాధ్యాయుడి సంతకం ఉన్న ఎలిజిబిలిటి సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్, జనన ధృవీకరణ పత్రం అందించాలన్నారు.

# విజయవంతం చేయాలి

చొప్పదండి, అక్టోబర్ 10: జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నల్లగొండలోని నరసింహా స్వామి ఆలయంలో బుధవారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రత్యేక పూజలు చేసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.